


శ్రీ లక్ష్మీనారాయణ ఫిలింస్

శ్రీ రామాంజనేయ యుద్ధం

ఈస్ట్‌మన్ కలర్

దర్శకత్వం: బాపు నిర్వహణ: ఎన్.ఎస్.మూర్తి

నిర్మాతలు: పోట్లూరి వెంకటనారాయణరావు, ఎన్.బి.కె. ఉమామహేశ్వరరావు

: తారాగణం :

నటరత్న, పద్మశ్రీ ఎన్. టి. రామారావు

కాంతారావు • ధూళిపాళ • అర్జా జనార్దనరావు
శ్రీధర్ • ముక్కామల • నాగరాజు • పి. జె. శర్మ
కాశీనాధ్ తాతా • సి. హెచ్. కృష్ణమూర్తి • రమేష్
భీమరాజు • బేతా రామచంద్రరావు

పద్మశ్రీ • బి. సరోజాదేవి • జయంతి • రాజశ్రీ
హేమలత • మంజుల • సువర్ణ

బాలతారలు

రాధ • మురళి • శ్రీనివాసు

: పంపిణీ దారులు :

ఆంధ్ర : శ్రీ లక్ష్మీనారాయణ పిక్చర్సు
నైజాం : శ్రీ నేషనల్ ఆర్టు పిక్చర్సు
గుంటూరు, నెల్లూరు జిల్లాలకు : జగపతి ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్సు
చిత్తూరు : కృష్ణవేణి పిక్చర్సు

: కథా సంగ్రహం :

రావణాది రాక్షస సంహారం చేసి శ్రీరాముడు పట్టాభిషిక్తుడయ్యాడు. ఆ ఆనందోత్సవాలలో పాలుపంచుకునేందుకు వచ్చి తిరిగి కిష్కింధకు వెళ్ళే అంజనేయుని విడువలేక శ్రీరాముడు బాధపడతాడు. భక్తి ప్రాముఖ్యమును ప్రశంసించిన పరమేశ్వరునితో భక్తి కన్నా శక్తి గొప్పదని పార్వతీదేవి పంతం కడుతుంది.

పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన జాలని కాశీరాజు యయాతికి శ్రీరాముడు దర్శనమిచ్చి అతడి ఆదర్శ భక్తిని ప్రశంశిస్తాడు. భక్తి శక్తులలో ఆధిక్యతను నిరూపించదలచిన పార్వతీదేవి యయాతి భక్తిని పరీక్షించుటకై మాయను కాశీరాజ్యానికి పంపిస్తుంది.

భార్యా బిడ్డలతో రామనామం ధ్యానం చేస్తున్న యయాతి రాజ మందిరంలో మాయ ప్రవేశించలేక పోతుంది. పలురకాల వింత మృగాలను సృష్టించి రాజ్యంలో భీభత్సం కల్పిస్తుంది. యయాతి ఆ వింత మృగాలను సంహరించి, మాయపై శబ్దభేధి అస్త్రమును ప్రయోగిస్తాడు. భయకంపితురాలైన మాయ మాతంగ కన్యగా మారి సప్తర్షి ఆశ్రమాలలో ప్రవేశించి విశ్వామిత్రుని శరణు కోరుతుంది. అంతలో శబ్దభేధి ఆమెను హతమారుస్తుంది. యయాతిని శాపాగ్నితో శపించబోగా నారదుడు వచ్చి యయాతిని కాపాడి పంపి వేస్తాడు. ఆగ్రహంతో మండిపడే విశ్వామిత్రునితో "అపరాధిని దండించవల సిన బాధ్యత సార్వభౌముడైన శ్రీరామునిదని, అందుకై ప్రయత్నించమని" నారదుడు పురికొల్పుతాడు.

విశ్వామిత్రుని అభియోగం విన్న శ్రీరాముడు అపరాధికి మరణ దండన విధిస్తాడు. కాని ఆ అపరాధి తన భక్తుడైన యయాతియేఅని తెలుసు కొని ఖిన్నుడౌతాడు. రాజధర్మ నిర్వహణలో స్వ పర బేధాలకు తావు లేదని యయాతిని బంధించి అయోధ్యకు గొనిరమ్మని భరతుని పంపుతాడు. యయాతి రామాజ్ఞను పాలించుటకై భరతునివెంట అయోధ్య బయలుదేరతాడు

తన నాథుని మరణదండన వృత్తాంతం నారదుని ద్వారా తెలుసు కొని ఖిన్నురాలై శాంతిమతి తన బిడ్డలతో సీతాదేవిని శరణు కోరుటకు అయోధ్యకు పయనమౌతుంది.

శక్తికే గదా ఘనవిజయం లభించిందని పార్వతీదేవి పరమేశ్వరుణ్ణి పరిహాసిస్తుంది. శంకరుడు భక్తి విజయం నిరూపించడానికి మహాప్రళయం కల్పిస్తాడు. ఆ పెనుతుఫానులో చిక్కుకొని భరతుడు, యయాతి, శాంతిమతీ బిడ్డలు చెట్టుకొకరుగా విడిపోతారు.

అసహాయుడైన యయాతి అపాయస్థితిలో అంజనాదేవి ఆశ్రమం వద్ద స్పృహతప్పి పడిపోతాడు. ఆమె అతనిని సేదతీర్చి దీర్ఘాయుష్మంతునిగా దీవిస్తుంది. మాతృవాక్య పరిపాలకుడైన హనుమ పరమ భక్తుడైన యయాతిని ఆపదనుండి రక్షిస్తానని శ్రీరాముని పాదసాక్షిగా ప్రమాణం చేస్తాడు. కాని యయాతిని చంపుటకు శపథం చేసినది శ్రీరాముడేనని నారదుని ద్వారా విని ఆంజనేయుడు కృంగిపోయినా కడకు భక్తరక్షణమే కర్తవ్యమని నిర్ణయిస్తాడు.

అరణ్యంలో ప్రమాదం పాలైన శాంతిమతిని శంకరుడు రక్షించి అయోధ్యాపురం చేరుస్తాడు. ఆమెను ఊరడించి సీతాదేవి ఆశ్రయమిస్తుంది. యయాతి బిడ్డలకు వశిష్ఠుడు అభయమిచ్చి తన ఆశ్రమానికి తీసుకొని వెడతాడు.

శ్రీరాముని దండనకు గురైన యయాతికి ఆంజనేయుడిచ్చిన అభయం వానరులలో సంచలనం కలిగిస్తుంది. యయాతిని అనుగ్రహించి, ఆంజనేయుని మన్నించమని అంగదుని రాయబారిగా పంపుతారు.


రాజధర్మంలో అనుబంధాలకు తావులేదనీ, యయాతిని పరిత్యజించి క్షమాపణ కోరకపోతే తీవ్రపరిణామాలకు గురికావలసి వస్తుందని శ్రీరాముడు హెచ్చరిస్తాడు.

భక్త రక్షణలో వెనుకంజ వేస్తే అపనింద తప్పదని నారదుడు, శంకరుడు ఆంజనేయుని ప్రబోధిస్తారు. శ్రీరామాంజనేయుల యుద్ధం అనివార్య మవుతుంది. రణరంగంలో భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు, సుగ్రీవ, అంగద, జాంబవంతాదులు మరణిస్తారు.

యయాతిని రక్షించమన్న సీతాదేవి ప్రార్థన, పితృభిక్ష ప్రసాదించమని వేడుకున్న యయాతి బిడ్డల ప్రార్థనలను శ్రీరాముడు నిరాకరించి రణరంగానికి తరలివెడతాడు.

ప్రతిజ్ఞా నిర్వహణకై శ్రీరాముడు, భక్త రక్షణకై ఆంజనేయుడు యుద్ధరంగంలో తారసిల్లుతారు.

శ్రీరామాంజనేయ యుద్ధం పర్యవసానమేమిటో ?
శక్తి, భక్తులలో దేనికి విజయమో ?
వెండితెరపై చూడండి !!



పాటలు

పాట 1

రచన :
దాశరథి

పాడినవారు :
బాలమురళీ కృష్ణ, లీల & పార్టీ

మొగ : మేలుకో శ్రీరామ ! మేలుకో రఘురామ ॥మేలుకో॥
ఆడ : మేలుకొని వేగ మమ్మేలుకోవయ్యా !
కోరస్ : మేలుకో – మేలుకో
మొగ : మేలుకో –
ఆడ : కులదైవమగు సూర్యు డుదయించు వేళాయే
అరవింద లోచనా మేలుకో ॥కులదైవ॥
మొగ : మునికోటి సురకోటి మునివాకిటను చేరి
నిను కొలువ నిలిచేరు మేలుకో
కోరస్ ॥ రామా – మేలుకో
మొగ : వరదా – మేలుకో
కోరస్ : రామా – మేలుకో
మొగ : వరదా – మేలుకో
తెల్ల యేనుగు వచ్చి ముంగిటా నిలిచేను
నల్లని మా స్వామి మేలుకో
ఎల్ల లోకాలను నీకఛత్రమ్ముగా
చల్లగా ఏలుకొన మేలుకో
కోరస్ : మేలుకో – మేలుకో
ఆడ : పదునాల్గు వర్షాలు వనవాస మొనరించి
బడలిపోయిన స్వామి మేలుకో
మొగ : అల రావణుని చంపి అవనినే కాపాడి
అలసిపోయిన స్వామి మేలుకో
కోరస్ : మేలుకో – మేలుకో
మొగ : మేలుకో
ఆడ : పన్నీటి జలకాల నిన్ను సేవించుకొన
పడతి జానకి వేచె మేలుకో ॥పన్నీటి॥
మొగ : అఖిల భువనమ్ములు అభిలషించే శుభము
అభిషేక సుదినమిదే మేలుకో
కోరస్ : అభిషేక సుదినమిదే మేలుకో

పాట 2

రచన :
కొసరాజు

పాడినవారు :
మాధవపెద్ది, వసంత & పార్టీ

సాకి : జయతు జయతు శ్రీరామా రామా!
జానకీ రామా – జగదభి రామా
పావన నామా – భండన భీమా
పట్టాభి రామా!

మొగ : వచ్చింది వచ్చింది రామరాజ్యం
శ్రీ రామయ్య పాలించు చల్లని రాజ్యం ॥వచ్చింది॥
సంపదలను తెచ్చింది – సౌఖ్యాలను యిచ్చింది

కోరస్ : సంపదలను తెచ్చింది – సౌఖ్యాలను యిచ్చింది

మొగ : భూలోకానికి స్వర్గం – దిగివచ్చింది ॥వచ్చింది॥

మొగ & ఆడ : అయోధ్యరాముడు ఇతడేలే! అవతారమూర్తి ఇతడేలే
॥అయోధ్య॥

మొగ & ఆడ : నారాయణుడే వచ్చి జన్మించాడు
నాలుగు కాళ్ళతో ధర్మం నడిపిస్తాడు ॥నారా॥
హారే – హారే – హారే – హారే ॥హారే॥

ఆడ : నెలకు మూడు వానలు నిలబడి కురియురా
పచ్చగ పైరు పెరిగి పంటలు పండురా ॥నెలకు॥

మొగ : అడిగినన్ని గుమ్మపాలు ఆవులు పిండురా
కరువు కాటకాల కసలు చోటే లేకుండురా ॥వచ్చింది॥

కోరస్ : పప్పు ధప్పళ్ళమ్ము మనకు పడుతుందిరా
జోరుజోరు పరమాన్నం జుర్రుతాముగా
జుఋ – జుఋ – జుఋ జుఋ

మొగ : బలే బలే తియ్యమామిడి పండ్ల నిండురా

కోరస్ : ఎగుగు – పై కెగురు; ఎగురు – పై కెగురు
ఎగురు – ఎగురు – ఎగురు – ఎగురు

పాట 3

రచన :
గబ్బిట వెంకటరావు

పాడినవారు :
బాల మురళీకృష్ణ

పల్లవి : కరుణాలోలా నారాయణా
శ్రితజనపాలా దీనావనా ॥కరుణా॥

చ॥ నవరస భరితం నీ పుణ్య చరితం
ఈ జగమే నీ లీలా వినోదం ॥నవ॥
కయ్యాలు లేక అల్లాడు నాకై
కలహ కారణం కల్పించినావా ॥కరుణా॥

పాట 4

రచన :
ఆరుద్ర

పాడినవారు :
పి. సుశీల, వసంత

సుశీల : శ్రీ కరమౌ శ్రీరామనామం
జీవామృత సారం
పావన మౌ రఘురామ నామం
భవతారక మంత్రం ॥శ్రీ కరమౌ॥
విశారద : దధిక్షీరముల కన్నా
ఎంతో మధుర మధుర నామం
సుశీల : సదాశివుడు ఆ రజితాచలమున
సదా జపించే నామం
విశారద : కరకుబోయి తిరగేసి పలికినా
కవిగా మలచిన నామం
ఇద్దరు : రామ రామ రామ రామా
రామ రామ రామ రామా
కరకుబోయి తిరగేసి పలికినా
కవిగా మలచిన నామం
సుశీల : రాళ్ళు నీళ్ళపై తేల్చిన నామం
రక్కసి గుండెల శూలం ॥శ్రీ కరమౌ॥
విశారద : వేయి జపాల కోటి తపస్సుల
విలువ [illegible] నామం
సుశీల : నిండుగ [illegible] పెదవుల [illegible]
రెండక్షరముల నామం
విశారద : ఎక్కడ రాముని భజన జరుగునో
అక్కడ హనుమకు స్థానం
సుశీల : [illegible]
[illegible]
ఇద్దరు : [illegible]
[illegible] ॥శ్రీ కరమౌ॥

పాట ౬

రచన :

డా॥ సి. నారాయణరెడ్డి

పాడినవారు :

జానకి

పల్లవి : రా రా ఓ రాజా – రా రా ఓ రాజా
చలచల్లని దినరాజా – సులి వెచ్చని నెలరాజా
సుందర ప్రణయ మందిరం – సుగుణ బంధురా
ముచ్చు ముందర కౌగిలి విందురా
ఇందురా – పొందరా
రా రా ఓ రాజా

చర 1 : ఆ చిగురుల సొంపులే – నా పెదవుల కెంపులు
ఆ విరిసిన పువ్వులే – నా వెన్నెల నవ్వులు
ఆ చిలకలే నా పలుకులు
ఆ కోకిలలే నా గీతికలు
వన మయూరాలు నా వయ్యారాలు
నవ వసంతాలు నా దృగంతాలు
ప్రకృతి నేనై పురుషుడవీవై
వరించి, రమించి, జయించి, తరించి రారా ఓ రాజా

చర 2 : రతిరాజు కోరేది రక్తి !
యతిరాజు కోరేది ముక్తి ?
ఆ రక్తియే ఈ రంభయై
నీ ముక్తియే పరిరంభమై
పరలోక బంధాలు తెంచుకో ?
రసరాగ బంధాలు పెంచుకో !
మునులు ఘన తపోధనులు పొందనిది
ముందే వుందని తెలుసుకో !
నీ ముందే వుందని తెలుసుకో – నా యందే వుందని తెలుసుకో
నీ ముందే – నీ ముందే – నీ ముందే – నీ ముందే
నీ ముందే – నా యందే వుందని తెలుసుకో

పాట ౬ (౨)

రచన :

గబ్బిట వెంకటరావు

పాడినవారు :

బాల మురళీకృష్ణ

పల్లవి : కరుణాలోలా నారాయణా
శ్రితజనపాలా దీనావనా !

చిర : ఎంతటి బ్రహ్మర్షి బిరుదంబులున్నా
శాంతము లేకున్న ఫలితంబు సున్నా
తాపసిక్ కీ వేళ తామసమది యేల ?
ఇది యెల్ల నీ లీల కాదా దేవా ! ॥కరుణా॥

పాట 6

రచన :
ఆరుద్ర

పాడినవారు :
పి. సుశీల, వసంత

సుశీల, విశారద : శ్రీయుతమౌ శ్రీరామ పాదం
శ్రితజన మందారం
పావన మౌ రఘురామ పాదం
పాప వినాశకరం ॥శ్రీ యుతమౌ॥

విశారద : కలుషమ్ముల ప్రక్షాళన చేసి
గంగ జనించిన పాదం

సుశీల : అసుర మదమ్మును పాతాళానికి
అణచివేసిన పాదం

విశారద : రాతిని నాతిని చేసిన పాదం
అడవికి అందం పోసిన పాదం

సుశీల : ఈ చరణమ్మే శరణమ్మనగా
యిచ్చును పెన్నిధానం ॥శ్రీ యుతమౌ॥

విశారద : అవలీలగ జలధిని దాటిన మేటి
పవన కుమారుడు పట్టేపాదం

సుశీల : బ్రహ్మేంద్రాదులు కొలిచే పాదం
పరబ్రహ్మ పదానికి మూలం

విశారద : తాను ధరించిన పాదుకలకు
ధర పట్టము కట్టిన పాదం

సుశీల : తమ్ముడు భరతుని తరతరాలకు
ధన్యుని చేసిన పాదం ॥శ్రీ యుతమౌ॥

పద్యం నెం. 1

రచన :
గబ్బిట వెంకటరావు

పాడినవారు :
పి. బి. శ్రీనివాస్

యయాతి

సీ॥ రామా సుగుణ ధామా రఘుకులాంబుధి సోమ
ఈ చిన్ని పాపల కీవె శరణు

సీతా జగన్మాతశ్రీ దేవి మహాలక్ష్మి
ఇక నీవె దిక్కు నా యింతి కిపుడు
ధీశాలి లక్ష్మణా ! దీక్షాపరాయణా
భారంబు నీదే మా ప్రజలబ్రోవ
అంజనా నందనా అరిలోక భంజనా
భక్తజనుల గాచు ప్రాపు నీవె
కోపకారణమేమొ – నా పాపమేమొ
ఆర్తరక్షకుడే నేడు అలుకబూనె
దైవ సంకల్పమును మీర తరమె నాకు
పోవ సెలవిండు – నా దేవదేవులారా !

పాట 7

రచన : **గబ్బిట వెంకటరావు**

పాడినవారు : **కె. రఘురామయ్య, & పార్టీ**

ఆంజనేయ శ్లోకం

జయతు జయతు మంత్రం
జన్మ సాఫల్య మంత్రం
రాం రాం రాం
జనన మరణ ఖేద క్లేశ విచ్ఛేద మంత్రం
రాం రాం రాం
రఘుపతి నిజమంత్రం – రామరామేతి మంత్రం
రాం రాం రాం

మొగ : రామ ! నీల మేఘశ్యామా ! కోదండ రామా !
రఘుకులాబ్ధి సోమా ! పరంధామా ! సార్వభౌమా !
॥రామా॥
నీలమేఘ శ్యామా !

కోరస్ : రఘురాం రాం రాం రఘురాం
జయరాం రాం రాం జయరాం !

మొగ : తలి, తండ్రి, గురువూ నీవే తోడు నీడ నీవె !
ధరణి యెల్ల పాలనచేసే పరంధామునివే
జాగుయింక చాలును రామయ్య
దాసులను బ్రోవగ రావయ్య

కోరస్ : జాగు యింక

మొగ : తెలియ తరమా – పలుక [illegible]

నీదు మహిమ రాఘవా !

కోరస్ : రామ నీల

మొగ : నీలమేఘశ్యామా !

రాతి నయినా నాతిని చేసే నీ దివ్యపాదము

కోతినైన జ్ఞానిని చేసే నీ నామము

నీదు సరి దైవము లేరయ్యా – నిన్నే నే నమ్మితి రామయ్యా

నీదు చరణం పాప హరణం

మాకు శరణం రాఘవా ! ॥రామ నీల॥

నీల మేఘ శ్యామా !

కోరస్ : రఘురాం రాం రాం – రఘురాం

జయరాం రాం రాం – జయరాం

రచన : గబ్బిట వెంకటరావు

పాడినవారు : మాధవపెద్ది

పద్యం 2

భండనభీముడు ఆర్తజన బాంధవుడు ఉజ్వల బాణతూణ కో
దండ కళాప్రచండ భుజ తాండవ కీర్తికి రామమూర్తికిన్
రెండవసాటి దైవమిక లేదు యిల లేదులేదనుచున్ గడకట్టి భేరి కో
దండ దండాండడముని నదంబు లజాండ మునిండ మత్త వేదండము నెక్కి
చాటెదను దాశరథీ కరుణా పయోనిధీ.

రచన : గబ్బిట వెంకటరావు

పాడినవారు : మాధవపెద్ది

పద్యం 3

అమరాధీశ, మహేశ్వర ప్రముఖులే ఆలంబులో నిల్వని
సమరోత్సాహ విజృంభమాణమయి భూ చక్రంబె అల్లాడని
విమలున్ ప్రాణ భయార్తునిన్ విడువడీ వీరాంజనేయుండు తథ్యము
తథ్యము శ్రీగోవిందుని పాదసాక్షి ! భయమేలా నిన్ను రక్షించెదన్
నమ్ముమా !

రచన :
గబ్బిట వెంకటరావు

పాడినవారు :
బాలమురళీ కృష్ణ

పద్యం 4

అభయ మిచ్చిన వెనుక కాదనడు హనుమ
ప్రతిన వీడడు శ్రీ రఘురామమూర్తి
ఇపుడు కథ రక్తి కట్టె ఇంకేమి లోటు
భక్తి శక్తులకింక తప్పదు రణంబు
కలహ భోజనమున నాకు కడుపు నిండు

పాట 8

రచన :
గబ్బిట వెంకటరావు

పాడినవారు :
బాలమురళీకృష్ణ

పల్లవి : కరుణాలోలా నారాయణా !
శ్రితజనపాలా దీనావనా ! ॥కరుణా॥

చర 1 : నీ పద భక్తికి నీ ఘన శక్తికి
నీవే వైరము కలిగించినావే
ఏ పరమార్థము మదినెంచినావో
తెలియగ వశమా నీ దివ్య మహిమా ॥కరుణా॥

పాట 9

రచన :
దాశరథి

పాడినవారు :
సుశీల, బృందం

కోరస్ : జయ జయ జయ సుగ్రీవ రాజా
జయ జయ జయ ఓ భాను తేజా

అత : వినోదాల కోసం ఈ జీవితం
విలాసాల కోసం ఈ యవ్వనం – లే జవ్వనం ॥వినోదా॥
అనురాగమాల – అందాల డోల
నీదేనురా – నేను నీ దానరా – ఖాగేలరా ॥జయజయ॥

మరుని కటారి - వలపు మిటారి
వగల వయ్యారి - నాట్యమయూరి
మురిపించురా మరిపించురా అలరించురా
చిలిపి చిన్నారి - కలికి సింగారి
నిను కోరెరా - నీ దరి చేరెరా జత గూడరా ॥జయ॥
అందంలోనే ఆనందం
ఆనందంలో అనుబంధం
అనుబంధమే మాధుర్యమూ
మాధుర్యమే మకరందమూ
తులలేనిది - విలువైనదీ
చెలికానుక - చేకొమ్మిక ॥జయజయ॥

పద్యం 9

రచన : పాడినవారు :
గబ్బిట వెంకటరావు మాధవపెద్ది

సీ॥ సర్వేశ్వరుండగు జానకీరాముని
చరణాంబుజములే శరణ మనుము
భక్తవత్సలుడైన పట్టాభిరాముని
వాత్సల్యమే మహా భాగ్యమనుము
సర్వజ్ఞుడౌ రామ చంద్రుతో వైరంబు
కలనైన యెంచని ఘటన యనుము
కారుణ్య ధాముడౌ శ్రీరాము శపధమ్ము
తొలుదొల్త నుంతైన తెలియదనుము
గీ॥ దాసు డెరుగక చేసిన దోస మనుము
రామ నామమే మారుతి ప్రాణమనుము
భక్తుని యయాతి రక్షించి పవనసుతుని
తప్పిదముగాచి కాపాడ స్వధర్మ మనుమా ।

పాట 10

రచన : పాడినవారు :
గబ్బిట వెంకటరావు ఎమ్. ఎస్. రామారావు

పల్లవి : శరణము నీవె శ్రీరామా
పావన నామా రఘురామా

చం : దశరథ నందన శ్రీరామ
దానవ భంజన రఘురామా ! జయరామా ! రిపు భీమా
శౌర్య పరాజిత భృగురామా ॥శర॥
సాధు జనావన రఘురామా
కారుణ్యాలయ శ్రీరామ
నీరజఋుచన ఘనశ్యామా ! జయరామా ! పరంధామా !
శ్రితజన పోషణ శ్రీరామ
పతిత పావన – రఘురామా ॥శర॥

పద్యం 6

రచన : పాడినవారు :

గబ్బిట వెంకటరావు బాలసుబ్రమణ్యం

క్షేమంబే గద అంజనేయునకు, సుగ్రీవాదులున్ భద్రమే
సేమంబేగద జాంబవంతుడు, కపిశ్రేష్ఠుల్ సుఖంబుందురే
తామేవేళల రామరాజ్య మహితా ధర్మంబు పాటింతురే ?
మా మేల్గోరుచు సత్య ధర్మ పదముల్ మన్నింతురే అంగదా !

పద్యం 7

రచన : పాడినవారు :

గబ్బిట వెంకటరావు ఎమ్ ఎస్ రామారావు

వగచి శరణన్నవాడు నీ భక్తపరుడు
బ్రోవ అభయమిచ్చినవాడు పుత్రసముడు
ఇరువురును రెండు కళ్ళు కాదె తలంప
పరుడెవరు నీకు వీరిలో పద్మనాభ

పాట 11

రచన : పాడినవారు :

గబ్బిట వెంకటరావు కె. రఘురామయ్య

సాకి॥ రామా ! తగునా
నీ దాసుపైన రణభేరి వేయ
ప॥ సాకేత సార్వభౌమా !
శరణు శరణయా జానకిరామా
కరుణ జూపవా మారుతిపై ॥సాకేత॥
। గలనైనా నిను కొలిచేనేను

కయ్యాని కేటు లోర్తురా !
రాచరికానికి హృదయమే లేదా ?
నెయ్యాని కెడ మీయదా !
ప్రేమని దాన న్యాయ మిదేనా
ఇంకేల ఈ శోధన ! ॥సాకేత॥

2॥ భక్తుల బ్రోచే వరదుడ వీవే
భారము నీదే నయా
ఏమరినావా చేసిన సేవ
నా మొర ఆలింపవా
దాసుని దోసం దండముతో సరి
భండన మేలనయా ॥సాకేత॥

పాట 12

రచన : పాడినవారు .

అరుద్ర పి. సుశీల, వసంత

విశారద, సుశీల : భీషణమా శ్రీరామ శపథం
వీడదు ధర్మపథం
ఇప్పటి యీ రఘురామ శపథం
హృదయ విదారకం ॥భీషణ॥
తండ్రొక వంక తనువును బాయ
తపో భూములకు చనెనే

సుశీల : తమ్ముడు భరతుడు ప్రార్థించినను
తాపసిగానే మనెనే

విశారద : మాట కోసమే అంతటి స్వామి
మాటున వాలిని గూల్చె

సుశీల : శోక జలధిలో తాను మునిగినా
సుఖములు సఖునకు నొసగే ॥భీషణ॥

విశారద : దారి నొసంగక దర్పము చూపిన
సాగర గర్భం చీల్చె

సుశీల : వైరి తమ్మునికి బాస చొప్పున
వైభవ రాజ్యం కూర్చె

విశారద : జగతికి ప్రాణం జగతికి భాగ్య
జనకుని ముద్దుల బాల

సుశీల : చింతలు బాపే శ్రీరామ వాక్యం
ఎంతటి బాధలు తెచ్చె ॥భీష॥

పాట 13

రచన :
ఆరుద్ర

పాడినవారు :
పి. సుశీల, వసంత

సుశీల, విశారద : భీకరమౌ శ్రీరామబాణం
తిరుగులేని అస్త్రం
పావన మౌ రఘురామబాణం
భక్త పరిత్రాణం ॥భీక॥
విశారద : కోపముతో కోదండము పూనిన
కొండలె అదిరేను
సుశీల : నారిని వింటికి సంధించినచో
నదులే పొంగేను
విశారద : తూణీరములో బాణము తీసిన
క్షోణియే వణికేను
సుశీల : అమ్మో వేసినా వమ్మో కాదట
ఆ రుద్రాదులు ఆపలేరట ॥భీక॥
విశారద : సీత చెరను విడిపించిన బాణం
పాతకులను ఖండించిన బాణం
సుశీల : నీతివర్తనుడు నిజభక్తునిపై
నేడు వేయతగునా — పాడిమీర తగునా
ఇద్దరు : తగదు తగదు అని సమస్తలోకులు
చాటి చెప్పరయ్యా
తగదు తగదు అని తల్లీ జానకి
మనవి చేయవమ్మా మమ్ము బ్రోవవమ్మా

పద్యం 8

రచన :
గబ్బిట వెంకటరావు

పాడినవారు :
వసంత

అమ్మా ! పార్వతి ! ఈ ఉపేక్ష తగదమ్మా
సాటి ఇల్లాలి కష్టమ్మె వేడుకగా దలంచి
పతి పజ్జన్ కుల్కుటే భావ్యమా
లే కెమ్మింకన్ పతి బిక్షన్ పెట్టినను పాలింపంగ రావేమి

విశ్వమ్మే భస్మము కాక తప్పదు సతీ సంక్షోభ దావాగ్నిచే

పద్యం 9

రచన :	పాడినవారు :
గబ్బిట వెంకటరావు	మాధవపెద్ది

శ్రీ రఘురామ చారుతులసీ దళధామ శమక్షమాది
శృంగార గుణాభిరామ త్రిజగన్నుత శౌర్య రమాలలామ
దుర్వార కబంధ, రాక్షస విరామ జగజ్జన కల్మషార్ణవో
త్తారకనామ బ్రోవగదే దాశరథీ కరుణాపయోనిధీ !

పద్యం 10

రచన :	పాడినవారు :
గబ్బిట వెంకటరావు	బాలసుబ్రమణ్యం

అరయవైతివి మనకు గలట్టి కూర్మి
కాంచవైతివి శ్రీరాము ఘనతనైన
వార్ధిలంఘించి జగజెట్టి వైన కతన
తలచినావేమో భుజబల దర్పమొకటే

పద్యం 11

రచన :	పాడినవారు :
గబ్బిట వెంకటరావు	మాధవపెద్ది

బాహుబలశాలి నన్న దర్పంబు కాదు
మదిని శ్రీరామ నామంబు మరువలేదు
పతిత పావనుడైన నీ బంటు నగుట
లక్ష్య మనుకొంటి శరణార్థి రక్షణంబె

పద్యం 12

రచన :	పాడినవారు :
గబ్బిట వెంకటరావు	బాలసుబ్రమణ్యం

సీ॥ శరణార్థి సుగ్రీవు సామంచర్య మొనర్చి
నీ వేడుకోలు మన్నించునాడు
బలశాలి వాలిని బరిమార్చి మీ కెల్ల
కిష్కింధనిచ్చి రక్షించునాడు
అసుర సంహారాన కగ్రగామిగ నిల్చి
వీరావతంసు గావించునాడు

అనితర దుస్సాధ్యమౌ మహా కార్యములే
సాధించు శక్తి నొసంగునాడు

గీ॥ భావి సృష్టికి నవ బ్రహ్మ నీ వటంచు
ప్రేమ మీరగ నిన్ను దీవించునాడు
అపుడు – ఆనాడు, ఇల వేల్పునైతి గాని
నేడు శ్రీరాముతోడ పనేమి హనుమా !

పద్యం 13

రచన : గబ్బిట వెంకటరావు
పాడినవారు : బాలసుబ్రమణ్యం

ధర్మము ధర్మమంచిటు వృధా వ్యధ చెందుట మాను మోయి నీ
నిర్మల భక్తియుక్తులకు, నేడు కళంకము రాకముందె, దు
ష్కర్మ యయాతివేగ ప్రభు సన్నిధికిన్ గొనిరమ్ము, వానిదౌ
కర్మఫలంబు మార్చగల కర్తలు లేరిల మారుతాత్మజా !

పద్యం 14

రచన : గబ్బిట వెంకటరావు
పాడినవారు : బాలసుబ్రమణ్యం

నీలకంధర ఫాల నేత్రాగ్ని కీలల
వెదిరించి నిలిచిన నిలువవచ్చు
మృత్యుదేవి భీషణాత్యుగ్ర దంష్ట్రిల
నుయ్యాల లూగిన నూగవచ్చు
ప్రళయ కాలాభీల భయద నిర్ఘాతాళి
అరచేత నదిమిన అదమవచ్చు
దండహస్తుని ఘోరతరకాల పాశమ్ము
గురి నిల్చి [illegible]

కాని ఎదిరింప [illegible]
బ్రహ్మకైనను నిర్జరేశ్వరునకైన
[illegible]
[illegible]

పద్యం 15

రచన : పాడినవారు :

గబ్బిట వెంకటరావు మాధవపెద్ది

అది తప్పుటకంటె అఘము లేదనిగదా
సస్వమిచ్చెను హరిశ్చంద్ర నృపతి
పలికి బొంకుట మహా కలుషమనిగదా
పాతాళ మేగెను బలి విభుండు
శరణార్థి బ్రోచుట వరధర్మమనిగదా
తన దేహమును శిబి తరిగి యిచ్చె
నిరత సత్యవ్రతా చరణు బౌటనేగదా
అసువులైనను వీడె దశరథేశుడు
అంతవరకేలనయ్యా ఓ అబ్జనాభ
తండ్రి మాటను నిలుపగా దలచిగాదె
పదియు నాల్గేండ్లు వనవాసివైతి నీవు
రమ్యగుణసాంద్ర శ్రీ రఘురామచంద్రా !

పద్యం 16

రచన : పాడినవారు :

గబ్బిట వెంకటరావు మాధవపెద్ది

ఖోటక బ్రహ్మచారికి కోర్కె యేల
మర్కటుండగు నాకు సామ్రాజ్యమేల
రామ రామా రామా రామ రామా యటన్న నీ
నామ మొకటే
కోటి స్వర సుఖాలు నాకో మహాత్మా !

పద్యం 17

రచన : పాడినవారు :

గబ్బిట వెంకటరావు మాధవపెద్ది

గజ్జె లందెలు ఘల్లు ఘల్లున కౌసల్య
అంకసీమను నాట్యమాడె పెద్ది
లోకపావని యైన ఆకాశ గంగకు
జన్మకారణమైన స్థానమెద్ది

పతి శాపమున రాతి బండయై పడియున్న
యింతికి నిజరూప మిచ్చినేది
అలతి విక్రమ మహోజ్వల దివ్యరూపాన
నిఖిల లోకంబులు నిండెనేది

జానకీదేవి నిచ్చుచు జనకరాజు
కనక పాత్రను పన్నీట కడిగెనేది
అట్టి నీ పాద నీరాజమయ్యె నాడు
కఠిన దేహంబు తాకంగ కందెనేమో !

పద్యం 18

రచన : గబ్బిట వెంకటరావు

పాడినవారు : మాధవపెద్ది

సీ॥ సీతమ్మ జాడ మీ చెవిని వేయ అంబోధి
త్రుటికాలమందు లంఘించునాడు
శత్రు నిర్భేద్యమౌ స్వర్ణ లంకను గెల్వ
సేతు బంధనమును చేయునాడు
మైరావణుని మృత్యు మర్మంబు ఛేదించి
స్థిరదీక్ష మిమ్ము రక్షించునాడు
ప్రాణావశిష్టుడౌ రామానుజుని బ్రోవ
సంజీవి కొనితెచ్చి సాకునాడు

ప్రాణములు పణమొడ్డి మీ ప్రాభవమ్ము
నిలుప, లంకా రణంబున గెలుచునాడు
కోతి సాయము మీ కొక కొంతయయ్యె
కనవె అ నాడు మా జాతి లక్షణము
మా కోతి లక్షణము
నేడు చింతించి వగచిన లాభమేమి ?

పద్యం 19

రచన : గబ్బిట వెంకటరావు

పాడినవారు : బాల సుబ్రమణ్యం

అంతటి శౌర్యవంతులు మహాబలి వాలి విజృంభణానికిన్
చింతల వంతలన్ బడి కృశింపగ నేటికి ఋష్యమూక మం
దెంతయు కాందిశీకులై హీనగతిన్ పడియుండనేల మా
చెంతకు వచ్చి బ్రోవుమని చేతులు మోడ్చగనేల మారుతీ !

పాట 20

రచన :
గబ్బిట వెంకటరావు

పాడినవారు :
బాలసుబ్రమణ్యం

సీ॥ గురునాజ్ఞ నెపమున తరుణి యంచెంచక
అల తాటకిని హత మార్చగలమె
నూః ఇచ్చితిమంచు మాటున పొంచుండి
చాటుగ వాలిని చంపగలమె
తమ్ముడు గుట్టీయ దశకంఠు వధియింప
కుక్షిలో బాణంబు కొట్టగలమె
పరనింద పేరిట వరసాధ్వి జానకి
అగ్నిలో దూక మంచనగ గలమె

చరణ సేవల నొనరించు పరమభక్తు
గురు వచనమంచు వధియింప తరల గలమె
నాగరికులు మీరు – వానరులము మేము
మీదు ఘనతకు సరిసాటి మీరు గాదే।

పద్యం 21

రచన :
గబ్బిట వెంకటరావు

పాడినవారు :
బాలసుబ్రమణ్యం

ధారుణి ఎల్లడన్ విలయతాండవమాడు అధర్మమున్, దురా
చారము రూపుమాపి, దనుజ ప్రకరంబుల తృళ్ళడంచి, భూ
భారము తీర్చి, శిష్ట జనపాలనకై అవతార ధారియౌ
కారణ జన్మ శ్రీ హరిని గాంచగజాలవే మోహబుద్ధివై.

దండకం 22

రచన :
గబ్బిట వెంకటరావు

పాడినవారు :
మాధవపెద్ది

శ్రీమన్మహావిష్ణు దేవా! అమేయ ప్రభావా! రమాధీశ
లోకేశ వైకుంఠవాసా! చిదానంద గోవింద శౌరిముకుందా!
విధాతన్ వ్యధం బెట్టు వేదాపహారిన్ సురారిన్ దురాచారి
బీరంబు నీరంబుగాగా మహాంబోధిలో జొచ్చి మాయావి తెగ
టార్చు లోకాంతనో ధాగ। మత్స్యావతారాగా।

2 ఫణీంద్రుండు త్రాడై గిరీంద్రంబు కవ్వంబుకాగా సురల
దానవుల్ క్షీరవారాసి చిల్కంగ భారంబునన్ క్రుంగు మం
ధాన గిరినెత్తు ఘన విస్తృతాకార కూర్మావతారా !

3 ధరన్ చాపగాచుట్టి లోకంబులన్ బట్టి పల్ హింసలన్ బెట్టు
ద్రోహిన్, హిరణ్యాక్షు అక్షౌణి శౌర్యంబునన్ దున్మ సుర
వైరి గర్వాపహారా వరాహావతారా !

4 హరి జూపు యెందుండెరా డింభకా యంచు నిజపుత్రు
బాధించునీచాత్ము శిక్షింప సరంభివై స్తంభమందే విజృంభించి
దైతేయు గర్వంబు ఖర్వంబు గావించు పరవీర హారరంహా
శ్రీ నారసింహా !

5 సురేంద్రాధికుండైన వైరోచనుం జేరి దానంబుగానేల మూడ
డుగులన్ గోరి ముల్లోకముల్ నిండ బలిరాజ ఘనరాజసం
బెల మాయంబు గావించి పాతాళమున ద్రొక్కు సురలోక
సంత్రాణ శ్రీ వామనా !

6 కన్ను మిన్నునన్ గనన్ లేని గర్వాంధుడా కార్తవీర్యున్ మహా
శౌర్యధుర్యున్ రణంబందు నిర్జించి క్షాత్రాళి క్రొన్నెత్తుటన్
తర్పణంబిచ్చి పితృ్యాణమున్ దీర్చు అరిలోక భీమా మహా
విక్రమా పరసురామా !

7 ఇలన్ సత్య ధర్మంబులన్ పాదుకొల్పన్ నిలింపాళి కష్టాల
దీర్పన్ మహాభీషణున్ లోక విద్రావణున్ రావణున్గూల్ప
అవతారమూర్తి పరంధామా కోదండరామా !
నమస్తే నమస్తే నమః

సాంకేతిక నిపుణులు

చిత్రకథ, సంభాషణలు, పద్యములు : గబ్బిట వెంకటరావు
పాటలు : ఆరుద్ర, దాశరధి, కొసరాజు, సి. నారాయణరెడ్డి, గబ్బిట వెంకటరావు
అవుట్ డోర్ యూనిట్ : శారదా ఎంటర్ ప్రైజెస్
స్టూడియో : వాహిని
లాబొరేటరీ : జెమినీ కలర్ లాబొరేటరీ
ప్రొసెసింగ్ : పి. నారాయణస్వామి
దుస్తులు : పి. వెంకట్రావు, కె. ఎ. రహమాన్, తంబు, బాబురావు
స్టంట్సు : సాంబశివరావు, పార్టీ
పబ్లిసిటీ డిజైన్స్ : ఈశ్వర్
ప్రెస్ పబ్లిసిటీ : విజయా
శిరోజాలంకరణ : పార్థసారధి, రాము, అప్పారావు, రాజ్యలక్ష్మి, శకుంతల
మేకప్ : కె. యస్. చౌదరి, పీతాంబరం, శివరామ్, రాజగోపాల్ కె. వి. సుబ్బారావు
నృత్యములు : బి. హీరాలాల్, కె. ఎస్. రెడ్డి, వెంపటి చినసత్యం
నేపథ్యగాయకులు : పద్మశ్రీ డా॥ ఎమ్. బాలమురళీకృష్ణ, ఎస్. పి. బాలసుబ్రమణ్యం, మాధవపెద్ది, కె. రఘురామయ్య, ఎమ్. ఎస్. రామారావు, పి. సుశీల, ఎస్. జానకి, పి. లీల, బి. వసంత
ప్రొడక్షన్ కంట్రోలర్ : పి. శ్రీనివాసరావు
కళ : ఎ. కె. శేఖర్, వి. భాస్కరరాజు, వాలి (దుస్తులు)
ట్రిక్ ఫొటోగ్రఫి : ఎస్. ఎస్. లాల్
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎన్. ఎస్. మూర్తి

సంగీతం : **కె. వి. మహదేవన్**

దర్శకత్వం : **బాపు**

నిర్మాతలు :

పొట్లూరి వెంకటనారాయణరావు
ఎన్. బి. కె. ఉమామహేశ్వరరావు


శ్రీ రామాంజనేయ యుద్ధం